వ్యాస కౌముది



# కవిసామ్రాట్టుని అనుక(స)రించిన మౌనముని?

## - ఫణి

ఇతిహాస రచన ద్వారా ప్రారంభమైన తెలుగు సారస్వత ప్రవాహము, ప్రబంధ కావ్య, పురాణ, కథ, నవల, నాటక రచనా ప్రక్రియల ద్వారా పరిపుష్టమై మహాజీవనదిగా మారి, తెలుగు ప్రజల జీవితాలను రససారవంతం చేస్తూ విశ్వసాహితీ సాగరములో కలుస్తూ తన విశిష్టతను చాటుకుంది. వీటిలో ఇతిహాస, ప్రబంధ కావ్య, పురాణ సాహిత్య ప్రక్రియలు చందోబద్ధ పద్య, గద్యముల సమ్మిళితములు. ఈ రచనా ప్రక్రియలలో కధ, కధనము ఎంచుకొనుటకు కవికి ఉన్న స్వేచ్ఛ ఆ సాహిత్య ప్రక్రియ రచనా విధి విధానములను అధిగమించుటలో లేదు. కాగా, కథ, నవల దాదాపుగా గద్య రచన ప్రక్రియలు, చందోబద్ధము కానివి ముఖ్యంగా ఒక నిర్దిష్టమైన రచనా విధి విధానములు లేనివి. ఒక కధాంశమును సమసామాజికాంశములతో, చారిత్రక విశేషాలతో, నవీన వైవిధ్యాలతో పరిపుష్టం చేసి, రకరకాల అంశముల, పద్ధతుల, ఆచారాల వర్ణనలతో వర్ణరంజితము చేసి, వీటికనుగుణంగా కధా పాత్రల మధ్య వ్యక్తిత్వ సంక్లిష్టతలను, సంఘర్షణలను సమ్మిళితం చేస్తూ కవి చేసే విస్తార రచనా ప్రక్రియ నవల. యింత విస్తార ప్రక్రియను పాఠక రంజకముగా మలచినప్పుడే కవి తన పనిలో సఫలుడయినట్లు.

20వ శతాబ్దంలో వచ్చిన రెండు నవలలు రసజ్ఞత కలిగిన చదువరులను అమితంగా ఆకర్షించాయనటంలో ఎటువంటి సందేహములేదు. అందున కవిసామ్రాట్ శ్రీ విశ్వనాధ సత్యనారాయణ గారి *వేయిపడగలు* మొదటిది కాగా రెండవది కవి, భారత దేశ రాజకీయ రంగములో అపర చాణుక్యుడిగా, మౌన మునిగా పేరుగాంచిన మాజీ ప్రధాని శ్రీ పి.వి.నరసింహారావు గారు రచించిన, తెలుగులో శ్రీ కల్లూరి భాస్కరం గారిచే అనువదింపబడిన "ద ఇన్‌సైడర్" – *లోపలి మనిషి. లోపలి మనిషి* రచన ఒక నవలా కాదా అన్నది ఒక తెలివైన విచికిత్స కాగా, యిది నవలా రచనా ప్రక్రియలకు అనుగుణంగా ఉండటం వల్ల దీనిని నవలగా భావించడం ఔచిత్యభంగం

కానేరదు. రెండు నవలలు విభిన్న విషయాలను స్పృశించినా వాటి రచనా నిర్మాణప్రక్రియలో ఉన్న సారుప్యత నూతన రచయితలను చాలా ఆలోచింప చేయడమే కాక ఆ ప్రక్రియను అనుకరించడానికి ప్రేరేపిస్తాయి. ఆ సారుప్యతను గురించి నాకు స్ఫురించిన విషయములను పాఠకులకు నివేదించి, నా ఆలోచనలను సరిచేసుకొనుట, తద్వారా నా రచనా కౌశలమును మెరుగుపరుచుకొనుట నా ఉద్దేశము. ఆశీర్వదించగలరు.

ప్రధమంగా ముందు ప్రస్తావించిన నవలల రచయితల గురించి కొన్ని ప్రాధమిక విషయములను పరిశీలిద్దాం. శ్రీ విశ్వనాధ వారు 1895 లో నందమూరు గ్రామములో జన్మించినారు. 1934 లో *వేయిపడగలు* నవలను ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన నవలా పోటీకి పంపుటకు 29 రోజులలో 999 పేజీలలో రచించారు. శ్రీ పి.వి. గారు 1921 లో వంగర గ్రామములో జన్మించినారు. ద ఇన్‌సైడర్ రచనా ప్రారంభం తెలియనపట్టికీ, ఆ 833 పేజీల నవల 1998 లో ముద్రితమైనది. *లోపలి మనిషి* తెలుగు అనువాదం 2002 లో ప్రచురితమైనా మూలము 1998 లోనే ప్రచురితమైంది కావున రెండూ 20వ శతాబ్దంలోనే వచ్చినట్టుగా భావించడంలో సహేతుకతుకు ఎటువంటి ప్రమాదము లేదు.

తరువాత యీ రచనలయొక్క కధ, కధనాల విషయానికి వస్తే, *వేయిపడగలు* కొన్ని తరాలలో జరిగిన మానవ సాంఘిక, వ్యావహారిక, సాంస్కృతిక, రాజకీయ పరివర్తన గురించి కధానాయకుని యొక్క అంతర్మధనము మరియు విచార(ణ)ము కాగా, *లోపలి మనిషి* ప్రధానంగా స్వాతంత్ర్యానంతర, దాదాపు అయిదు దశాబ్దాల రాజకీయ పరిణామ మరియు పరివర్తనల మీద కధానాయకుని విశ్లేషణ. రెండు రచనల మధ్య ప్రధాన సారూప్యం ఏమిటంటే రెంటిలోనూ రచయితలే వారి జీవన అనుభవాలను, వారికి ఎదురైన రకరకాల వ్యక్తుల ప్రవృత్తులను, ఆనాటి సమకాలీన సాంఘిక పరిస్థితులను సమ్మిళితం చేసి ఒక కధగా సృష్టించి పరోక్షంగా కధానాయకుని ద్వారా తమ భావాలను వ్యక్తీకరించారు అని పాఠకుడు అనుభూతి చెందటం.

ముందుగా *వేయిపడగలు* కథానాయకుడు ధర్మారావు పాత్ర చిత్రీకరణను సంక్షిప్తంగా పరిశీలిద్దాం. కథానాయకుడైన ధర్మారావు పాత్ర "ఆ ఎదురు వచ్చిన మహా పురుషుడి పేరు ధర్మారావు" అన్న వాక్యం ద్వారా మొదటి అధ్యాయం చివరలో ప్రవేశిస్తుంది. నవలలో ధర్మారావు పాత్రను పండితుడిగా, వివేకవంతుడిగా సుబ్బన్నపేట సమాజంలో ఒక మాన్యుడిగా పరిగణింపబడే వ్యక్తిగా చిత్రీకరించారు విశ్వనాధ వారు. ఆ విద్వత్తు, మాన్యత వల్ల నవలలోని కొన్ని పాత్రలు, ముఖ్యంగా యువ జమిందారు, ఆయన అనుయాయులు ధర్మారావును శత్రువుగా పరిగణించగా, దాదాపుగా మిగతా అన్ని పాత్రలు ఆయనను అభిమానించారు, గురువుగా, అన్నగా పరిగణించారు. ధర్మారావు సమాజంలో ఎంత ప్రముఖ వ్యక్తి అయినా తన చిన్న కుటుంబంతో – భార్య మరియు తన తల్లితో, నవలలో చాలా భాగం నిరుపేద జీవనం గడుపుతాడు. ఆవిధంగా ధర్మారావు తన జీవన గమనంలో ఉత్థాన పతనాలతో సహజీవనం చేస్తూ, తను అమితంగా

ప్రేమించే భార్య అరుంధతి వియోగం వల్ల దుఃఖవశుడవటం, తదనంతరం తనను మనసా వరించిన చిన్న-అరుంధతిని వివాహం చేసుకొనటం తద్వారా జీవితంలో క్రొత్తదశ ప్రారంభించటంతో నవల ముగుస్తుంది. యీలోగా ఏన్నో పాత్రలు, విస్తారమైన వాటి స్వభావ వివరణలు, వివిధ ఋతువుల, పరిణామాల వర్ణనలు నవలకు విస్తృతిని, శోభను చేకూర్చాయి.

కౌముది కిరణ్ ప్రభ గారు విశ్వనాధ వారి మీద చేసిన ప్రసంగాల ద్వారా, విశ్వనాధ వారు స్వయంగా రచించుకున్న కొద్ది పేజీల ఆత్మచరిత్ర గురించి శ్రీ గొల్లపూడి వారు వ్రాయగా నేను చదివిన విషయాల ద్వారా పరిశీలిస్తే కథానాయకుడు ధర్మారావు పాత్ర గమనంలో విశ్వనాధవారు తన జీవితంలోని కొన్ని ఘటనలను యిమిడ్చారు అని అనటం సత్యదూరం కానేరదు. ముందుగా ధర్మారావు పాత్రా ప్రవేశ సందర్భంలో అతని గురించి విశ్వనాధ వారు చేసిన వర్ణన వారి స్వీయవర్ణన అని మనం గ్రహించవచ్చు. అలాగే ధర్మారావు పాత్ర అనుభవించిన పేదరికం, గుంటూరు కళాశాలలో విద్యార్థిగా ఉండగా జరిగిన సంఘర్షణలు, అరుంధతితో వివాహం, సుబ్బన్నపేట కళాశాల అధ్యాపక పదవి నుంచి వైదొలగటం మొదలయిన ఘటనలు విశ్వనాధ నిజ జీవితంలోనివి అని భావించటం సత్యదూరం కానేరదు. అలాగే తన తండ్రి తరం వరకు ఐశ్వర్యవంతులైనవారు, తన తరంతో కడు పేదరికం లోకి వెళ్ళటం అనే తన నిజజీవిత ఘటనను ధర్మారావు పాత్రలో కరుణరసం ఉట్టిపడేలా చిత్రించారు విశ్వనాధ వారు. తన జీవితంలోని ఈ విషయములను తెలుగు సాహిత్యంపై సమగ్రంగా సుదీర్ఘంగా జరిపిన చర్చలో వారే స్వయంగా పేర్కొన్నారు (https://www.youtube.com/watch?v=RH3MN7VA9Ec&t=2510s),

ఈ విధంగా వారు చూసిన ఆనాటి సాంఘిక పరిస్థితులను, వాటి వల్ల ఆయన జీవితంలో జరిగిన మార్పులను పరోక్షంగా వివిధ పాత్రల ద్వారా అభివ్యక్తీకరించి విశ్వనాధ వారు నవలని నడిపించినతీరు నవలా సాహిత్యంలో ఒక క్రొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఆ వైవిధ్యమే *వేయిపడగలు*ను నవలా సాహిత్యంలో ఒక విశిష్ట స్థానంలో నిలబెట్టింది. అయితే *వేయిపడగలు* తరువాత నవలా సాహిత్యం ఉచ్చ దశకు వెళ్ళినా, మరల ఏ యితర నవలా ఈ ప్రక్రియలో వ్రాయబడలేదు. బహుశా *వేయిపడగలు*ని హిందీ లోకి అనువదించిన ప్రభావంతో కావచ్చు, పి.వి గారు తన *లోపలి మనిషి* రచనకు ఈ ప్రక్రియను ఎంపిక చేసారు. యిప్పుడు *లోపలి మనిషి* నవలా విశేషాలు కూడా బహు సంక్షిప్తంగా చూద్దాం.

“ఆనంద్ అని పేరు పెట్టారు అబ్బాయికి ..” అని కథానాయకుని పేరుతోనే నవల ప్రారంభమవుతుంది. ఆనంద్ బాలమేధావి, బాల్యం నుంచీ మేధావి. ధర్మారావు మరియు ఆనంద్ పాత్రల మధ్య ఉన్న ఒకేఒక సారుప్యత ఇదే. పాఠశాల, కళాశాల విద్య తర్వాత ఆనంద్ అఫ్రోజాబాద్ రాచరికానికి వ్యతిరేకంగా రహస్య ఉద్యమం నడిపి, స్వాతంత్ర్యానంతరం అఫ్రోజాబాద్ సంస్థానాన్ని విశాల స్వతంత్ర భారతావనిలో విలీనం చేయటంలో తన యవ్వన జీవితమును గడుపుతాడు. తర్వాత ప్రత్యక్ష ప్రజాస్వామిక రాజకీయలలో పాల్గొని అంచెలంచెలుగా ఎదిగి అఫ్రోజాబాద్

ముఖ్యమంత్రి అవుతాడు. అయితే తన రాజకీయ ప్రత్యర్థుల కుతంత్రాల కారణంగా అచిరకాలంలోనే ఆనంద్ ముఖ్యమంత్రి పదవి కోల్పోవటంతో నవల ముగుస్తుంది. అయితే చివరలో నవలను ఉపసంహారం చేస్తూ ఆనంద్, శ్రీ రాజీవ్ గాంధి మరణం తర్వాత ప్రధానమంత్రి అయ్యాడు అని చెప్పటంతో నవల పూర్తిగా ముగుస్తుంది. యీ నవలలో ఏన్నో కల్పిత పాత్రలతో పాటుగా కొన్ని నిజమైన పాత్రలు, విస్తారమైన వాటి స్వభావ వివరణలతో పాటుగా స్వతంత్ర భారతావని ఎదుర్కొన్న సంక్లిష్టమయిన వివిధ అంతర్జాతీయ మరియు అంతర్గత సమస్యల వివరణలు నవలకు విస్తృతిని, శోభను చేకూర్చటంతో పాటు పాఠకుడిని విజ్ఞానవంతుడిని చేస్తాయి.

ధర్మారావు పాత్ర విషయంలో అంత లోతుగా ఆలోచించకుండానే, ఆనంద్ పాత్ర, పి.వి. గారి లోపలి మనిషి అన్న విషయం వివేచన ఉన్న పాఠకుడికి తెలుస్తుంది. కథానాయకుడు ఆనంద్ అఫ్రోజాబాద్ సంస్థానాన్ని విముక్తం చేయటం కోసం పోరాటం, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అయ్యే క్రమం పాఠకుడికి ఆ ఆలోచనలో తోడ్పడతాయి. అయితే కల్పిత పాత్రల స్వభావాలు, కథానాయకునికి వారు కలిగించే అడ్డంకులు, కాల్పనికతకు ఆస్కారం లేని నిజ జీవిత పాత్రలతో కల్పిత పాత్రల సంభాషణలు, అంతర్జాతీయ మరియు అంతర్గత సమస్యల వివరణలు పాఠకుడిని రంజింపచేస్తాయి.

ఆ విధంగా *వేయిపడగలు*, *లోపలి మనిషి* నవలలు విభిన్న అంశాలను ప్రస్తావించినప్పటికీ, వాటి రచనా ప్రక్రియలో ఉన్న సారూప్యత ఆశ్చర్యం కలిగిస్తుంది. తానే ఒక పాత్రగా ఉన్న సమకాలీన సమాజ ప్రవృత్తిని ఒక కథగా మలచాలంటే, అలాగే సమాజంలో తథ్యమయిన ఒక విషయాన్ని నిగూఢముగా, వివాద రహితముగా, విస్తారముగా చెప్పాలంటే ఎంచుకోవాల్సిన రచనా సంవిధానాన్ని ఈ రచనలు నావంటి వర్ధమాన రచయితలకు తెలియచేస్తాయి. ఆ విధంగా ఈ రచనలు శాశ్వతాలు మరియు మార్గదర్శకాలు, ఆ రచయితలు గురుసమానులు అని చెప్పవచ్చు.

COMMENTS